క్లుప్తంగా

తాగొద్దు.. తిరగొద్దు : డీఎస్పీ



నరసింహమూర్తి

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో ప్రజలు నూతన సంవత్సర వేడుకలను ప్రశాంత వాతావరణంలో జరుపుకోవాలని డీఎస్పీ నరసింహమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆదివారం ఆయన విలేకరుతో మాట్లాడుతూ.. డిసెంబరు 31న శ్రీకాళహస్తి నగరంతో పాటు తొట్టంబేడు, బుచ్చినాయుడుకండ్రిగ రోడ్ల వద్ద చెక్‌పోస్టులు ఏర్పాటు చేసి తనిఖీలు చేపడుతామన్నారు. మద్యం దుకాణాలు, బార్లను నిర్ణీత సమయంలోపు మూసివేయాలన్నారు. కన్నప్పసేతు, రామసేతు వంతెనల వద్ద నూతన సంవత్సర వేడుకలను నిషేధిస్తున్నట్లు చెప్పారు. బైక్‌లు, కార్ల రేసింగ్ చేసే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. బహిరంగ ప్రదేశాల్లో మద్యం తాగడం, వేడుకల పేరుతో అర్ధరాత్రి రోడ్ల వెంట తిరుగుతూ హద్దు మీరితే చర్యలు తప్పవన్నారు. 31వ తేదీ నుంచి జనవరి 1వ తేదీ లోపు రాత్రి సమయాల్లో హోటళ్లు, ఫంక్షన్‌హాల్, ప్రైవేటు స్థలాల నిర్వాహకులు పోలీస్ స్టేషన్‌లో అనుమతి తీసుకోవాలన్నారు.

ప్రకృతి వ్యవసాయంపై అవగాహన



రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

బుచ్చినాయుడుకండ్రిగ : ప్రకృతి వ్యవసాయంతో పండించిన పంటలను తింటే వ్యాధులకు దూరంగా ఉండవచ్చునని ప్రకృతి వ్యవసాయ శాస్త్రవేత్త శంకర్, తెలంగాణలోని వనపర్తి జిల్లా వైద్యాధికారి జయచంద్రమోహన్ తెలిపారు. ఆదివారం బుచ్చినాయుడుకండ్రిగలో సహజ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో రైతులకు ప్రకృతి వ్యవసాయంపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. రసాయనిక ఎరువులతో పండించిన పంటల వలన వివిధ రోగాల బారిన పడుతున్నామన్నారు. అనంతరం పిల్లల ఎదుగుదలలో తల్లిదండ్రులు పాత్రపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో యోగా గురువు సురేష్‌నాయుడు, రైతులు పాల్గొన్నారు.

వైద్యశిబిరానికి స్పందన



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ యశ్వంత్ రాజ్

సత్యవేడు : మండలంలోని కొల్లడం, సత్యవేడు సబ్ జైల్లో నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఆదివారం గుడ్ షెఫర్డ్ హాస్పిటల్ సౌజన్యంతో సింగిల్ విండో మాజీ చైర్మన్ నిరంజన్ రెడ్డి సహకారంతో ఆదివారం నిర్వహించిన వైద్య శిబిరంలో కొల్లడంలో 151 మంది, సబ్‌జైలులో 24 మందికి కంటి పరీక్షలు, బీపీ, షుగర్ పరీక్షలను వైద్యులు యశ్వంత్, లోకనాథం నిర్వహించారు. 175 మందికి ఉచితంగా మందులు అందజేశారు. అంతకు ముందు అమెరికా నుంచి వచ్చిన విదేశీయులు ఏసు ప్రార్థనలు నిర్వహించారు. ఆరోగ్య నియమాలపై అవగాహన కల్పించారు. పేదలకు కోసం ఏటా ఉచితంగా కొల్లడంలో వైద్య సేవలకు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో కంటి వైద్యులు ప్రియా, సురేష్, నర్సులు జయంతి, వనజ, ఫార్మసిస్టు సురేష్ బాబు, గుడ్‌షెఫర్డు డైరెక్టర్ ప్రవీణ్ కుమార్, మేనేజర్ వెంకటేష్, సుశీల్‌రాజ్ పాల్గొన్నారు.

గిరిజన మహిళలు ఆర్థికంగా రాణించాలి



కుట్టు మిషన్లు పంపిణీ చేస్తున్న చర్చి ప్రతినిధులు

రేణిగుంట(ఏర్పేడు) : గిరిజన మహిళలు ఆర్థిక స్వావలంబన దిశగా పయనించాలని వక్తలు కోరారు. ఏర్పేడు మండలంలోని రాజుల పాలెం గిరిజన కాలనీలో జీసస్ వర్డ్ మినిస్ట్రీస్ వారు గిరిజన కాలనీలో నివసిస్తున్న 12 మంది మహిళలకు ఉచిత టైలరింగ్ శిక్షణ ఇచ్చి కుట్టు మిషన్లు, ట్రైనింగ్ సర్టిఫికెట్లను అందజేశారు. కార్యక్రమంలో నేత్ర సొసైటీ ప్రెసిడెంట్ మేరీ, ఏర్పేడు హెచ్‌పీ గ్యాస్ మేనేజర్ రవి, గిరిజన సంఘం లీడర్ శ్రీనివాసులు, ఈశ్వర్ రెడ్డి, వెంకటరత్నం పాల్గొన్నారు.

హాస్టల్ పరిశీలన

నాగలాపురం : పిచ్చాటూరు ప్రభుత్వ బీసీ బాలికల సంక్షేమ హాస్టల్ దుస్థితిని ఎమ్మెల్యే కోనేటి ఆదిమూలం పరిశీలించారు. ఆదివారం ఉదయం 11 గంటలకు బీసీ సంక్షేమ హాస్టల్‌ను సందర్శించారు. వార్డెన్‌తో కలిసి పైకప్పు పెచ్చులూడి , కిటికీలు, తలుపులు లేని హాస్టల్ గదులను పరిశీలించారు. తినడానికి ప్లేట్లు లేక పోవడంతో కొన్ని ప్లేట్లను తెప్పించి విద్యార్థులకు అందించారు. అధ్వానంగా ఉన్న బీసీ సంక్షేమ హాస్టల్‌కు నిధులు మంజూరు చేయాలని కలెక్టరు వెంకటేశ్వర్‌కు ఫోన్‌లో విన్నవించారు. అనంతరం విద్యార్థులతో కలిసి మధ్యాహ్నభోజనాన్ని ఎమ్మెల్యే రుచి చూశారు. ఆయన వెంట హాస్టల్ వార్డెన్ గీత, స్థానిక నాయకులు ఉన్నారు.



పక్క చిత్రంలో మృతదేహాన్ని తరలిస్తున్నవారు పెద్ద పాండూరులోని ముస్లింలు. వీరికి గ్రామ సమీపంలో శ్మశాన వాటిక ఉంది. 40 ఏళ్లుగా ఆ శ్మశాన వాటికలో దహన సంస్కారాలు చేపట్టేవారు. అయితే శ్మశాన వాటికకు వెళ్లేందుకు గతంలో పొలాల మధ్య చిన్న పాటి బాట ఉండేది. నేడు ఆ బాటను సమీప రైతులు ఆక్రమించుకోడంతో దారి సౌకర్యం లేక పంట పొలాల నడుమ శవాన్ని తీసుకెళ్లాల్సిన పరిస్థితుల్లో అవస్థలు పడుతున్నారు.



నాగలాపురం మండలం సురుటుపల్లిలో మనిషి చనిపోతే ఆ మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించేందుకు వారి బాధలు వర్ణనాతీతం. గ్రామ సమీపంలో ఉన్న వాగును దాటి అవతలికి శవాన్ని తరలించాల్సిన దుస్థితి. వీరి శ్మశానవాటిక దారి ఇబ్బందుల గురించి అనేకసార్లు ప్రభుత్వ అధికారులకు విన్నవించినా స్పందన లేదని గ్రామస్తులు వాపోతున్నారు.

ఆ నలుగురికీ అగచాట్లే!



వరదయ్యపాళెం మండలం సాతంబేడులో పంట పొలాల్లో శవాన్ని మోసుకెళ్తున్న స్థానికులు

- ఆఖరి మజిలీకి ఆటంకాలెన్నో?
- శ్మశాన వాటికలకు దారి సౌకర్యం లేక ఇక్కట్లు
- వాగులు, వంకలు దాటితేనే అంత్యక్రియలు
- వర్షాకాలమొస్తే ఇబ్బందులు వర్ణనాతీతం

వరదయ్యపాళెం : స్వాతంత్ర్యం వచ్చి 75 ఏళ్లు అవుతున్నా నేటికీ ఆఖరి మజిలీకి అగచాట్లు తప్పడం లేదు. అన్ని రంగాల్లో అగ్రగామిగా నిలుస్తున్నామన్న ప్రభుత్వాల గొప్పలకు కనీసం శ్మశాన వాటికలకు దారి లేదన్న సమస్యలు కనిపించడం లేదు. ప్రధానంగా వర్షాకాలంలో సాటి మనిషి చనిపోతే మృతదేహాన్ని శ్మశాన వాటికకు తరలించాలంటే వాగులు, వంకలు, పంట పొలాలు దాటాల్సిన దురవస్థ దాపురించింది. వర్షాకాలంలో వీటన్నింటినీ అధిగమించి శ్మశాన వాటికకు శవపేటికను తరలించాలంటే సత్యవేడు నియోజకవర్గంలోని పాడె మోసే ఆ నలుగురి కష్టం వర్ణనాతీతం.

కూటమి ప్రభుత్వం బాధలు ఆలకించేనా..

ఓవైపు రోడ్ల అభివృద్ధికి ప్రత్యేక చొరవ చూపుతామని ప్రగల్బాలు పలుకుతున్న కూటమి ప్రభుత్వం శ్మశాన వాటికలకు వెళ్లే రోడ్ల గురించి దృష్టి పెట్టాలని స్థానిక గ్రామస్తులు కోరుతున్నారు. వర్షాకాలంలో మనిషి చనిపోతే శవాన్ని తరలించేందుకు పడుతున్న కష్టాలనైనా చూసి ప్రభుత్వం స్పందించాల్సిన బాధ్యత ఉందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



వరదయ్యపాళెం : కోవూరుపాడులో పంట పొలాల మధ్య శవాన్ని తీసుకెళ్తున్న కుటుంబ సభ్యులు

నియోజకవర్గంలో శ్మశాన వాటికకు దారి సౌకర్యం లేని గ్రామాలు

- బీఎన్‌కండ్రిగ మండలంలోని కనవనంబేడు, కాటూరు, కొత్తపాళెం, కంచనపుత్తూరు, పీవీకండ్రిగ, అలత్తూరు, పుత్తేరి, కుక్కంబాకం, కాంపాళెం, బీఎస్‌పురం, నెలవాయి గ్రామాల్లో శ్మశాన వాటికలకు నేటికీ దారి లేని దుస్థితి.
- కేవీబీపురం మండలంలో కళత్తూరు, మహాదేవపురం
- సత్యవేడు మండలంలో నరసరాజు అగ్రహారం, కొల్లడం
- నారాయణవనం మండలంలో తీరువట్యం దళితవాడ
- పిచ్చాటూరు మండలంలోని అటవికొడింబేడు
- వరదయ్యపాళెం మండలంలో సాతంబేడు, రాచర్ల అరుంధతివాడ, కోవూరుపాడు, చెన్నవారిపాళెం, అకిసింపాళెం, కారిపాకం గ్రామాల్లో అదే పరిస్థితి. అలాగే పెద్ద పాండూరు గ్రామంలో ముస్లిం శ్మశాన వాటికకు గతంలో ఉన్న దారిని స్థానిక రైతులు ఆక్రమించుకోగా నేడు పంట పొలాల్లో వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది.

“

అడుగు తీసి అడుగు వేయలేక..



మా గ్రామానికి శ్మశాన వాటిక పంట పొలాల మధ్యలో ఉంది. గ్రామం నుంచి శ్మశాన వాటికకు వెళ్లాలంటే అర కి.మీ దూరం పంట పొలాల నడుమ వెళ్లాలి. వర్షాకాలంలో ఓ వైపు సాగు చేసిన వరి పంట, మరోవైపు వర్షపు నీటితో నిండిన పొలాల్లో అడుగు తీసి అడుగు వేయలేక శవాన్ని మోసుకెళ్లలేక తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. ప్రభుత్వం స్పందించి రైతులతో మాట్లాడి రోడ్డు సౌకర్యం కల్పించండి.

- రాంబాబు, కోవూరుపాడు

సర్వే చేసి దారి కల్పించండి



పెద్ద పాండూరులో ముత్తరాశిపాళెంకు సమీపంలో ముస్లిం శ్మశాన వాటిక ఉంది. 40 ఏళ్లుగా అక్కడే ముస్లింలకు సంబంధించి ఎవరైనా మృతి చెందితే దహన సంస్కారాలు చేసుకుంటున్నాం. అయితే శ్మశాన వాటికకు వెళ్లే దారి కొద్ది రోజుల కిందట కొంచెం కొంచెం ఆక్రమించారు. దీంతో దారి సౌకర్యం లేక శ్మశాన వాటికకు వెళ్లేందుకు తీవ్ర ఇబ్బందులు పడుతున్నాం. సర్వే చేపట్టి దారి సౌకర్యం కల్పించాలి.

- నాగూర్ బాషా, పెద్ద పాండూరు

ఏళ్ల తరబడి అవస్థలు



మా గ్రామంలో శ్మశాన వాటికకు దారి లేక ఏళ్ల తరబడి అవస్థలు పడుతున్నాం. వర్షాకాలంలో మా గ్రామంలో మనిషి చనిపోతే ఉన్నవాళ్లకు చావొచ్చే పరిస్థితి ఏర్పడుతోంది. వాగు దాటి అవతలికి తరలించేందుకు తీవ్ర అవస్థలు పడుతున్నాం. ఈ సమస్య గురించి పదుల సంఖ్యలో అధికారులకు అర్జీలు ఇచ్చి విన్నవించినా ఏమాత్రం పట్టించుకోవడంలేదు.

- సుబ్రహ్మణ్యం, సురుటుపల్లి, నాగలాపురం మండలం

ట్రాఫిక్ కష్టాలు

శ్రీకాళహస్తి : శ్రీకాళహస్తి పట్టణంలో ట్రాఫిక్ కష్టాలు తీరడంలేదు. ఇక్కడికి నిత్యం వేల మంది భక్తులు తిరుమల శ్రీవారిని దర్శించుకున్న అనంతరం శ్రీకాళహస్తికి చేరుకోవడం వల్ల ట్రాఫిక్ సమస్య తలెత్తుతోంది. ఆర్టీసీ బస్టాండు నుంచి కుమారస్వామి తిప్పమీదుగా పెద్దమసీదు, పూర్ణం బేకరి, జయరామరావువీధిలో కలిసే రోడ్డు నిత్యం రద్దీగా ఉంటోంది. వైఎస్ఆర్ విగ్రహం నుంచి పెండిమండపం మార్గం వన్‌వే చేయడంతో ఆలయానికి వెళ్లే వాహనదారులు పెద్ద మసీదు వీధిగుండా వెళుతున్నారు. ఈ వీధిలో రోడ్డు విస్తీర్ణం తక్కువగా ఉండటంతో నిత్యం రద్దీ నెలకొంటోంది. అలాగే పూర్ణం బేకరీ నుంచి జయరామరావువీధిలోకి తిరిగే వద్ద హోల్‌సేల్ దుకాణాల వద్ద సరుకు వాహనాలు నిలబెట్టడంతో ఆ రోడ్డు జనంతో కిటకిటలాడుతోంది. ఆలయం వద్ద ఉన్న దుకాణాలు, రెండు వైపులా ముందుకు సాగడంతో ఆ ప్రాంతంలో బస్సు తిరగాలంటే ఇబ్బందులు పడాల్సి వస్తోంది. గాలిగోపురం 40 అడుగుల రోడ్డు కావాలని మట్టిని తొలగించి రోడ్డును ఏర్పాటు చేశారు. అయితే బజారువీధిలో అన్ని దుకాణాల వద్ద వాహనాలు నిలబెట్టడంతో రద్దీ నెలకొంటోంది. ఆలయం నుంచి వచ్చే భక్తులు, ఓ పక్క స్థానికుల వాహనాలతో బజారువీధి కిక్కిరిసిపోతోంది. అధికారులు దృష్టి సారించి బజారువీధి, దర్గావీధి, భేరివారి మండపం ప్రాంతం, పాత బస్టాండు, సూపర్ మార్కెట్ ప్రాంతాల్లో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటే తప్ప సమస్య తీరే పరిస్థితి కనిపించడం లేదు.



దర్గావీధిలో వాహనాల రద్దీ



వాహనాలు వెళ్లేదెలా..



ట్రాఫిక్‌తో నిలిచిపోతున్న వాహనాలు

జ్వరాలతో విలవిల

- మంచం పట్టిన బుచ్చినాయుడుకండ్రిగ
- గ్రామాల్లో పడకేసిన పారిశుద్ధ్యం
- కిటకిటలాడుతున్న ఆస్పత్రులు
- మొక్కుబడిగా వైద్యసేవలు

బుచ్చినాయుడుకండ్రిగ :వాతావరణ మార్పులతో పాటు వరుస తుపాన్ల ప్రభావంతో గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసింది. ఈ నేపథ్యంలో మండల ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. మండలంలోని పుత్తేరి, కుక్కంబాకం, ఆలత్తూరు, వేణుగోపాలపురం, కాటూరు, జీఎన్‌కండ్రిగ, చిన్నయగుంట, తహానగర్, పూసలపల్లి, కాంపాళెం పంచాయతీల్లో విపరీతంగా జ్వరాలు ప్రబలుతుండడంతో జనం ఆస్పత్రులకు క్యూ కడుతున్నారు.

ఎడతెరిపి లేకుండా కురిసిన వర్షాలతో గ్రామాల్లో డ్రైనేజీ కాలువలు లేకపోవడంతో మురుగు నీరు వీధుల్లోకి చేరటంతో బురదమయంగా మారుతున్నాయి. మురుగు నీరు వీధుల్లో నిల్వ ఉండటంతో దుర్గంధం వెదజల్లుతోంది. మురుగు నీటికుంటల్లో దోమలు వృద్ధి చెంది రాత్రిపూట స్వైర విహారం చేస్తున్నాయి. పైపులైన్ లీకేజీలతో బురద నీరు కలుస్తుండటంతో తాగునీరు కలుషితం అవుతోంది. ఈ నీటిని తాగడం వలన పలువురు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లోని ఓవర్ హెడ్ ట్యాంకులతో పాటు, నీటి ట్యాంకులను శుభ్రం చేయకపోవడం, క్లోరినేషన్ చేయకపోవడంతో తాగునీరు కలుషితమై జ్వరాలు వ్యాపిస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు.

ఆస్పత్రులు కిటకిట

బుచ్చినాయుడుకండ్రిగలోని ప్రభుత్వ, ప్రైవేటు ఆస్పత్రులకు జ్వరాలతో పాటు, జలుబు, దగ్గుతో రోజుకు సుమారు 200 మందికి పైగా ఆస్పత్రులు చేరుతున్నారు. శ్రీకాళహస్తిలోని ఏరియా ఆస్పత్రిలో జ్వరాల చికిత్స కోసం మండలం నుంచి భారీ సంఖ్యలో వెళుతున్నారు. టైఫాయిడ్, మలేరియా, డెంగ్యూ జ్వరాలు ఎక్కువగా వస్తుండటంతో ప్రజలు భయాందోళనకు గురవుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం మెరుగునకు చర్యలు చేపట్టడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. గ్రామాల్లో వైద్య సిబ్బంది అందుబాటులో లేకపోవడం, గ్రామాల్లో వైద్య సిబ్బంది అంతంత మాత్రంగానే పర్యటిస్తుండటంతో జ్వరాల బారిన పడకుండా సూచనలు ఇచ్చే వారే కరువయ్యారని చెబుతున్నారు. మండల స్థాయి అధికారులు గ్రామాల వైపు కన్నెత్తి చూడకపోవడంతో ఎక్కడి సమస్యలు అక్కడే తిష్ట వేశాయి.



ఆస్పత్రికి చేరిన జ్వర బాధితులు



గాజులపెళ్లూరులో బురదమయంగా వీధి రోడ్డు

“

తాగునీరు కలుషితం

గ్రామాల్లో సమస్యలు తిష్ట వేసి ప్రజలు జ్వరాల బారిన పడుతున్నారు. గ్రామాల్లో పారిశుద్ధ్యం పడకేసి ఉండటంతో పాటు కలుషితమైన తాగునీరు తాగడం వలనే జ్వరాలు సోకుతున్నాయి. అధికారులు గ్రామాల్లోని సమస్యలు పరిష్కరించాలి.

- రమణయ్య, పుత్తేరి

వాతావరణ మార్పులతో జ్వరాలు

వాతావరణ మార్పులతో పాటు దోమ కాటుతో జ్వరాలు ప్రబలుతున్నాయి. గ్రామాల్లో ప్రతి ఒక్కరూ దోమ తెరలు వాడాలి. దీంతో పాటు గ్రామాల్లోని పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలి. నీటిని కాచి వడపోసి తాగితే కొంత వరకు వ్యాధులు వచ్చే అవకాశం తక్కువగా ఉంటుంది.

- దివాకర్, వైద్యాధికారి

బీజేపీ మండల అధ్యక్షుడిగా రాయల్

వరదయ్యపాళెం : బీజేపీ మండల అధ్యక్షుడిగా ఢిల్లీప్ రాయల్‌ను ఆ పార్టీ నేతలు ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం వరదయ్యపాళెంలోని కేబీజీ కల్యాణ మండపంలో తిరుపతి జిల్లా బీజేపీ అధ్యక్షుడు చంద్రప్ప అధ్యక్షతన నిర్వహించిన క్రియాశీలక కార్యకర్తల సమావేశంలో ఎన్నుకున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షుడు పార్టీ శ్రేణులకు దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్ రెడ్డి, కన్వీనర్ మునిసుబ్రహ్మణ్యం, జిల్లా ఉపాధ్యక్షుడు నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

క్యాలెండర్ల ఆవిష్కరణ

వరదయ్యపాళెం : దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో నూతన సంవత్సర క్యాలెండర్లను ఆ సంఘం నాయకులు ఆవిష్కరించారు. ఆదివారం వరదయ్యపాళెంలోని కేబీజీ కల్యాణ మండపంలో క్యాలెండర్ ఆవిష్కరణ కార్యక్రమం నిర్వహించారు. దేవాంగ సంఘం ప్రధాన కార్యదర్శి మాడిశెట్టి శివశంకరయ్య, పృథ్వీ రవి, మన్నెముద్దు రఘు తదితరులు పాల్గొన్నారు.

ఏఐవైఎఫ్ అలుపెరుగని పోరాటాలు



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి కత్తి రవి

సత్యవేడు : శాంతి, అభ్యుదయం, శాస్త్రీయ సోషలిజం కోసం ఏఐవైఎఫ్ అలుపెరగని పోరాటాలు చేస్తోందని జిల్లా కార్యదర్శి కత్తి రవి అన్నారు. ఆదివారం అఖిల భారత యువజన సమాఖ్య సమావేశం జరిగింది. ఈ సమావేశంలో మాట్లాడుతూ.. దేశం కోసం ప్రాణాలు అర్పించిన భగత్‌సింగ్, రాజ్‌గురు, సుఖదేవ్, చంద్రశేఖర్ అజాద్, అల్లూరి సీతారామరాజు బ్రిటీష్ సేనను ఎదిరించిన వారి స్ఫూర్తితో నేడు ఏఐవైఎఫ్ పోరాటాలు చేస్తోందన్నారు. మత్తు పదార్థాల నిర్మూలన కోసం ప్రజాస్వామ్య పరిరక్షణ కోసం పోరాటాలు సాగిస్తున్నామన్నారు. శ్రీ సిటీలో స్థానిక ఉద్యోగ అవకాశాలు, ఈఎస్ఐ, పీఎఫ్ సౌకర్యాలు కల్పించాలన్నారు. కార్యక్రమంలో నూతన కమిటీ ఎన్నుకొన్నారు. అధ్యక్షుడిగా మురళి, ఉపాధ్యక్షులుగా ప్రతాప్, నవీన్, సాదయమయ్య, కార్యదర్శిగా నాగార్జున, సహాయ కార్యదర్శులుగా విధీష్, మునిశేఖర, వెంకటేశ్, తరుణ్‌రాజ్ , కోశాధికారిగా సుబ్బును ఏకగ్రీవంగా ఎన్నుకొన్నారు.

ఉత్సాహంగా స్పోర్ట్స్ మీట్



బహుమతి ప్రదానం చేస్తున్న మోహన్

వరదయ్యపాళెం : కేంద్ర యువజన మంత్రిత్వశాఖ, చిత్తూరుకు చెందిన నెహ్రూ యువ కేంద్రం, స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సొసైటీ సంయుక్తంగా నిర్వహించిన స్పోర్ట్స్ మీట్ కార్యక్రమం ఆదివారం వరదయ్యపాళెంలోని జడ్పీ ఉన్నత పాఠశాల క్రీడా మైదానంలో ఉత్సాహంగా సాగింది. మండల వ్యాప్తంగా వివిధ క్రీడలకు సంబంధించి 32 జట్లు పాల్గొనగా స్వచ్ఛత్ రూరల్ డెవలప్‌మెంట్ సంస్థ అధ్యక్షుడు మావుదూరు మోహన్ క్రీడలను ప్రారంభించారు. ఈ సందర్భంగా కబడ్డీ, వాలీబాల్ పోటీలు హోరాహోరీగా సాగాయి. వాలీబాల్ విభాగానికి సంబంధించి చిలమత్తూరుకు చెందిన కెప్టెన్ ఎబినేచర్ పాల్ జట్టు మొదటి స్థానం సాధించింది. అలాగే కబడ్డీ పోటీల్లో వరదయ్యపాళెం దళితవాడకు చెందిన కెప్టెన్ రాజేష్ జట్టు ప్రథమ స్థానం సాధించింది. వీరికి సంస్థ అధ్యక్షుడు మావుదూరు మోహన్ రూ.5 వేల చొప్పున మొదటి బహుమతిని అందజేశారు. వరదయ్యపాళెం, సంతవేలూరు హైస్కూళ్లకు చెందిన వ్యాయామ ఉపాధ్యాయులు బందిలకుమార్, మనోహర్ క్రీడా పోటీలను పర్యవేక్షించారు. కార్యక్రమంలో ఆణిముత్యంరెడ్డి, భారత్ గ్యాస్ ఏజెన్సీ నిర్వాహకులు వెంకటేష్, బీజేపీ నాయకులు గుత్తి త్యాగరాజు, ఆధ్యాత్మిక గురువు నాగప్రసాద్, బాలకృష్ణ, విశ్రాంత ఉపాధ్యాయులు రామసుబ్బయ్య పాల్గొన్నారు.

● అడుగేస్తే... ఆ చివర పడాల్సిందే!



రేణిగుంట మండలంలోని పల్లె వీధులు దారుణంగా మారాయి. రోజు ఆ వీధుల నుంచి రాకపోకలు సాగిస్తున్న పల్లె జనం కష్టాలు వర్ణనాతీతం. చినుకు పడితే ఆ వీధుల్లో అడుగేస్తే ఎక్కడ జారిపడతామోననే పరిస్థితులు దాపురించాయి. ఇటీవల కురిసిన వర్షాలకు మండలంలోని గాజులమండ్యం, దేశమ్మ నగర్, సూరప్ప కసం, విప్పమాని పట్టెడ గ్రామాల్లోని వీధులు బురదమయమై ప్రజల రాకపోకలకు తీవ్ర అవస్థలు పడుతున్నారు.

- శ్రీకాళహస్తి రూరల్ (రేణిగుంట)

కోడిపందేల స్థావరాలపై దాడులు

శ్రీకాళహస్తి : తొట్టంబేడు సమీపంలో కోడి పందేల స్థావరాలపై తొట్టంబేడు ఎస్ఐ ఈశ్వరయ్య ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. ఈ దాడుల్లో అయిదుగురు జూదరులను అరెస్టు చేసి రెండు కోళ్లను స్వాధీనం చేసుకున్నారు. కోడిపందేలు ఆడితే చర్యలు తప్పవన్నారు.